క్లుప్తంగా

తాండవ కాలువ పనులు పరిశీలన



తాండవ కాలువ మరమ్మతులు పరిశీలిస్తున్న అధికారులు

నాతవరం : తాండవ ఆయకట్టు పరిధిలో కల్వర్టులు ఆక్వాడెక్టులు మరమ్మతు పనులు చురుగ్గా చేస్తున్నామని తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ అన్నారు. ఆమె సోమవారం తాండవ రిజర్వాయరు నుంచి ఆయకట్టుకు నీరు సరఫరా చేసే కాలువల మరమ్మతులు పనులు పరిశీలించారు. ఈఏడాది తాండవ కాలువలు అభివృద్ధి కోసం 18 పనులను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇంతవరకూ 5 పనులు పూర్తి చేశామని, మరో రెండు పనులు ప్రారంభించనున్నామని తెలిపారు. ఉపాధి నిధులతో తాండవ కాలువలో పూడికతీత పనులు చేస్తున్నారన్నారు. తాండవ ప్రధాన గేట్ల లీకేజీ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు.

దేశభక్తి గీతాల పోటీలు



చౌడువాడ గ్రంథాలయంలో దేశభక్తి గీతాల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కె.కోటపాడు : దేశభక్తిని పెంపొందించుకోవాలని చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు దేశభక్తి గీతాలపై పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులను ఏ విధంగా గౌరవిస్తామో..దేశాన్ని అంతే విధంగా ప్రేమించాలని తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోండి



సీపీఎం డివిజన్ సెక్రటరీ అడిగర్ల రాజు

నర్సీపట్నం : నిబంధనలకు విరుద్ధంగా మండువేసవిలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం డివిజన్ సెక్రటరీ అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. కొన్ని ప్రైవేటు కళాశాలలు నిబంధనలను తుంగలో తొక్కి తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. జూన్ ఒకటి నుండి తరగతులు నిర్వహించాల్సి ఉండగా న్యూ అడ్మిషన్ల కోసం కళాశాలల యాజమాన్యాలు తప్పుడు విధానాలకు పాల్పడుతున్నారన్నారు. డెమో క్లాసులకు పంపించమని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. నిబంధనలు అతిక్రమించిన కళాశాలలపై రీజనల్ కోఆర్డినేటర్‌కు ఫిర్యాదు చేస్తామని, పట్టించుకోకపోతే ఆందోళన చేపడతామని రాజు హెచ్చరించారు.

గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు

కె.కోటపాడు : గర్భిణులు, బాలింతలు పౌష్టిక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ సూచించారు. కొరువాడ జగన్నాథపురం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలు అందించారు. 119 మందికి సాధారణ పరీక్షలను జరిపి ఉచితంగా మందులను అందించారు. బీపీ, సుగర్ పరీక్షలతో పాటు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ ప్రమీల, ఏఎన్‌ఎం ముత్యాలమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలపై తీర్మానం

చోడవరం : నియోజకవర్గంలో సమస్యలపై టీడీపీ మినీ మహానాడు పలు తీర్మాణాలు చేసింది. చోడవరంలో ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి మినీ మహానాడును సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ తాతయ్యబాబు, రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, నాయకులు పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలో ఘాట్‌రోడ్ జంక్షన్‌లో మినీ మహానాడు సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కుమార్ మాట్లాడారు.

రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేసుకోండి

దేవరాపల్లి: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతు పెట్టుబడి సహాయానికి రైతు సేవా కేంద్రాల్లో లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నామని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆమె సూచించారు.

నిధులపై గొప్పలు... పెండింగ్‌లో బిల్లులు!

- స్పీకర్ నియోజకవర్గంలో నత్తనడకన అభివృద్ధి పనులు
- ఆరునెలలుగా రూ.కోట్లలో బిల్లుల పెండింగ్
- చేతులెత్తేస్తున్న కాంట్రాక్టర్లు
- అయోమయంలో అధికారులు



మార్చి నెలాఖరులోగా వేసిన తారురోడ్డు



బిల్లు కోసం ఎదురుచూస్తున్న సిమెంటు రోడ్డు



సకాలంలో పనులు పూర్తి చేయాలని సభలో అధికారులకు స్పీకరు అయ్యన్న ఆదేశం (ఫైల్)

మండలాల వారీగా పనులు, పెండింగ్ బిల్లుల వివరాలు...

మండలం పేరు	పనులు మంజూరు	పూర్తి చేసినవి	బిల్లులు పెండింగ్
నాతవరం	167	120	5.50 కోట్లు
నర్సీపట్నం	55	46	4.65 కోట్లు
గొలుగొండ	140	132	6.34 కోట్లు
మాకవరపాలెం	117	90	6.60 కోట్లు

నాతవరం : పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో చేసిన పనులకు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు చెల్లింపులు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా నర్సీపట్నం నియోజకవర్గంలో ఏడాది కాలంలోనే వివిధ అభివృద్ధి పనులకు రూ.80 కోట్లు నిధులు తెచ్చానని అసెంబ్లీ స్పీకరు అయ్యన్నపాత్రుడు గొప్పగా సభలో చెప్పేవారు. ఈ నిధులతో అధికంగా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు మండలాల మధ్య సరిహద్దు రోడ్లు పనులు చేపట్టారు. ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఆరు నెలల వ్యవధిలోనే చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లింపులు చేసేవారు. ఆరు నెలలు గడిచిన దగ్గర్నుంచి ప్రభుత్వం బిల్లుల ఊసెత్తలేదు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో పంచాయతీరాజ్‌శాఖ ద్వారా మొత్తం 480 పనులు మంజూరు చేశారు. ఈ పనుల్లో సిమెంటు రోడ్లు గ్రామాల మధ్య లింకు రోడ్లు , డ్రైనేజీ నిర్మాణ పనులు ఉన్నాయి. చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లింపులు చేస్తామని అయ్యన్నపాత్రుడు బహిరంగ సభలో చెప్పేవారు. గత వైఎస్సార్‌సీపీ హయంలో బిల్లులు ఇవ్వకుండా కాంట్రాక్టర్లు అధికారులు ఇబ్బంది పెట్టేవారంటూ విమర్శలు చేసేవారు. కానీ నియోజకవర్గంలో ఇంతవరకు చేసిన సిమెంట్ రోడ్లు ఇతర అభివృద్ధి పనులకు పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి డిసెంబరు నుంచి బిల్లులు చెల్లించలేదు. సకాలంలో పనులు పూర్తి చేసి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చి నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలంటూ స్పీకర్ స్వయంగా అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులపై తీవ్ర ఒత్తిడి చేసేవారు. స్పీకరు ఆదేశాలకు భయపడిన అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లపై మరింత ఒత్తిడి చేయడంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సిమెంట్ రోడ్లు, ఇతర పనులు పూర్తి చేశారు. నియోజకవర్గంలో చేసిన పంచాయతీరాజ్‌కు సంబంధించి రూ. 30 కోట్లకుపైగా బిల్లులు ప్రభుత్వం ఆరు నెలలుగా చెల్లించక పెండింగ్‌లో ఉన్నాయి. మార్చి గడిచి కొత్త ఆర్థిక సంవత్సరం వచ్చి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వం బిల్లుల ఊసెత్తడం లేదు. మండలాలకు పర్యటనకు వచ్చినప్పుడు తన క్యాంపు ఆఫీసులో సమీక్షలు నిర్వహించేటప్పుడు స్పీకరు అయ్యన్న సిమెంట్ రోడ్డు పనులు నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలంటూ అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేసేవారు. ప్రస్తుతం ఆరు నెలలుగా బిల్లులు రాకపోవడంపై స్పీకరు కనీసం పట్టించుకోలేదంటూ అన్ని వర్గాల వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో మిగిలి ఉన్న సిమెంటు రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు నత్తనడకన నడుస్తున్నాయి. మొదట్లో చేసిన మాదిరిగా పనులు వేగవంతం చేయాలని అధికారులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి చేయడంతో బిల్లులు సకాలంలో ఇస్తేనే చేయగలమని, అధిక వడ్డీలకు అప్పులు చేసి పనులు చేయలేమని చేతులెత్తేస్తున్నారు.

బిల్లుల పెండింగ్ మాట వాస్తవమే..



పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో చేసిన సిమెంట్ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి మొదట్లో బిల్లులు బాగానే వచ్చేవి. ప్రస్తుతం చేసిన పనులకు ఆరు నెలలుగా బిల్లులు చెల్లించలేదు. కాంట్రాక్టర్లు బిల్లులు ఎప్పుడు వస్తాయంటూ ప్రతి రోజు అడుగుతున్నారు. రోజూ సమాధానం చెప్పలేకపోతున్నాం. గత ఏడాదితో పోల్చుకుంటే ఇప్పుడు పనులు చేయడంలో కూడా బిల్లులు రాక కాంట్రాక్టర్లు జాప్యం చేస్తున్నారు.

– శ్రీ వెంకటేశ్వరమ్మ, జేఈ పంచాయతీరాజ్‌శాఖ

పీజీఆర్ఎస్‌లో 31 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం : సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో భూ సమస్యలు, ఇతర సమస్యలు మొత్తంపై 31 అర్జీలు వచ్చాయని ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా పంపకాలు జరగని ఉమ్మడి భూమిలో సోదరుడు దేముడు కుమారుడు నాయుడు దౌర్జన్యంగా ఇల్లు నిర్మాణం చేస్తున్నాడని మాకవరపాలెం మండలం, శెట్టిపాలెం పంచాయతీ శివారు వెంకన్నపాలేనికి చెందిన నాయుడు, అయ్యలనాయుడు, గంగాధర్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. బీసీడి సర్టిఫికేట్ మంజూరు చేయాలని కోరుతూ రావికమతం మండలం, కన్నంపేట గ్రామానికి చెందిన నాగులపల్లి బాబురావు ఆర్డీవోకు దరఖాస్తు చేసుకున్నారు. అన్నదమ్ముల మధ్య భూవివాదాల కారణంగా భూసర్వే నిలిపివేయాలని దరఖాస్తు చేశామని, అప్పటి నుంచి తన భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని మాకవరపాలెం మండలం, మర్రిపాలెం గ్రామానికి చెందిన గొల్లు సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. ఆక్రమణకు గురైన జిరాయితీ భూమిని అప్పగించాలని కోరుతూ ప్రదీప్‌కుమార్ అనే వ్యక్తి దరఖాస్తు చేసుకున్నారు. వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేస్తుంటే తన పేరున పది ఎకరాల భూమి ఉన్నట్టు ఆన్‌లైన్‌లో చూపిస్తుందని, తనకు ఎలాంటి భూమి లేనందున పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ ఓ మహిళ ఆర్డీవోకు దరఖాస్తు చేసింది.

వైస్ ఎంపీపీగా ఎన్నికైన విజయలక్ష్మికి సత్కారం



వైస్ఎంపీపీ-1 గా ఎన్నికైన అనంతరం ప్రమాణ స్వీకారం చేస్తున్న విజయలక్ష్మి

మాడుగుల : వైస్ ఎంపీపీగా ఎన్నికైన పాలిమేర విజయలక్ష్మిని నాయకులు, అధికారులు అభినందించారు. ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంటకట రాజారామ్, మాజీ ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ -2 కొత్తపల్లి శ్రీనువాస్, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఆర్య వైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు, దేవరాపల్లి శ్రీనువాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, వైఎస్సార్ సీపీ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గొళ్ళవిల్లి సంజీవరావు, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషా, ఉపసర్పంచ్ జవ్వాది వరహాలు ఎంపీడీవో అప్పారావులు విజయలక్ష్మి భర్త పాలిమేర చిన్నారావు,తో పాటు ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయలక్ష్మిని దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైఎస్ ఎంపీపీ1 గా ఎన్నికైన విజయలక్ష్మి మాట్లాడారు.తన సేవలు గుర్తించి పదవి దక్కడానికి కారణమైన మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడుకు, ఎంపీపీ రాజారామ్, మాజీ ఎంపీపీ రామధర్మజ, నాతోటి ఎంపీటీసీలకు, నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

చీడికాడ : ప్రకృతి వ్యవసాయం సాగు దిశగా రైతులు ముందుకెళ్లాలని సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనువాసరావు అన్నారు. సోమవారం మండలంలోని ఖండివరంలో కేపీపీ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రైతులతో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వృద్ధి చేయడానికి పీఎండీఎస్ కిట్స్ పొలంలో వేయడం ప్రధానమన్నారు. ఉత్తమ రైతులు డొకల అప్పలనాయుడు, రైతులు గుల్లిపల్లి వరహాలమూర్తి సుంకర వెంకటలక్ష్మి, తంగేటి నారాయణమ్మ మాట్లాడుతూ చెరకులో జంటసాళ్లు, వరి, అపరాల సాగు మేలు చేస్తుందని తెలిపారు.

సుజల స్రవంతి భూ సర్వే అడ్డగింత

రావికమతం : తోటకూరపాలెం రెవెన్యూ పరిధిలో సుజల స్రవంతి భూములు సర్వే చేయనీకుండా గ్రామస్తులు అడ్డుకున్నారు. సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా పెదపూడి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మిస్తున్నారు. పెదపూడి, పంగిడి, తోటకూరపాలెంలోని భూములు సుజల స్రవంతి ప్రాజెక్టులో కలుస్తాయి. తహసీల్దార్ ఆదేశాల మేరకు తోటకూరపాలెం పరిధిలో ప్రభుత్వానికి చెందిన చెరువులు, కొండ గెడ్డలు, వాగులు, కొండ పోరంబోకు, డి.పట్టా భూములు సర్వే చేయడానికి తోటకూరపాలెం, చీమలపాడు, టి.అర్జాపురం వీఆర్వోలు, సచివాలయం సర్వేయర్లు తోటకూరపాలెం వెళ్లారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో కోల్పోయే భూములకు ధర నిర్ణయించకుండా సర్వే చేయడానికి వీల్లేదని రైతులు అభ్యంతరం తెలిపారు. తహసీల్దార్ రైతులతో ఫోన్‌లో మాట్లాడగా గ్రామసభ నిర్వహించి భూములకు ధర ఎంత నిర్ణయిస్తారో తేల్చాక అందరి ఆమోదంతోనే సర్వే చేయాలని గ్రామస్తులు తహసీల్దార్‌కు స్పష్టం చేశారు.

పంచాడకు అభినందల వెల్లువ



పంచాడను సత్కరిస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సత్యం, బాబూరావు, ఎంపీటీసీలు




వైస్ ఎంపీపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎన్నికల అధికారి మంజులవాణి, ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి : మండల పరిషత్ వైస్ ఎంపీపీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మామిడిపల్లి ఎంపీటీసీ సభ్యుడు పంచాడ సింహాచలం నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక ప్రక్రియలో ఎంపీడీవో సువర్ణరాజు, పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీపీ బుల్లిలక్ష్మి, వైస్ ఎంపీపీ-2 గంగాభవానీ, ఎంపీటీసీలు పోతల వెంకటరావు, కోలా వెంకటరమణ, రొంగలి నారాయణమ్మ, వంటాకు పైడితల్లమ్మ, బొడ్డు లక్ష్మి, రుత్తల లక్ష్మి, బండి గౌరమ్మ, మజ్జి దేవి, ఈశ్వరమ్మ, కోఆప్షన్ మెంబర్ దండే జాన్ విక్టర్ పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం బూడి అభినందనలు

వైస్ ఎంపీపీగా ఏకగ్రీవంగా గెలుపొందిన పంచాడ సింహాచలం నాయుడుతో పాటు వైస్ ఎంపీపీని ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎంపీటీసీ సభ్యులను మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అభినందించారు. ఎన్నిక అనంతరం వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు తారువలో మాజీ డిప్యూటీ సిఎం బూడిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సింహాచలం నాయుడును బూడి ముత్యాలనాయుడు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. తనకు వైస్ ఎంపీపీగా అవకాశం కల్పించిన మాజీ డిప్యూటీ సీఎంకు గెలిపించిన ఎంపీటీసీ సభ్యులకు, గెలుపునకు కృషి చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులకు పంచాడ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే వైస్ ఎంపీపీగా గెలుపొందిన పంచాడను పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబూరావు, సర్పంచ్‌లు చింతల సత్య వెంకటరమణ, సూరినాయుడు, ఉపసర్పంచ్ పెదనాయుడు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, చల్లా మహేష్ అభినందించారు.

చోడవరం మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా అల్లాజీ



అల్లాజీని అభినందిస్తున్న బొత్స సత్యనారాయణ, కరణం ధర్మశ్రీ

చోడవరం : చోడవరం: మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా షేక్ అల్లాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చోడవరం మండలపరిషత్‌లో 25 మంది ఎంపీటీసీలకు 20 మంది ఎంపీటీసీలు, ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఉన్నారు. వీరిలో మైనార్టీ ముస్లింకు చెందిన షేక్ రహిమాన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీనితో ఈ స్థానం ఖాళీ ఏర్పడింది. ఈ స్థానానికి సోమవారం ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా మండల స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వరి, అదనపు ఎన్నికల అధికారి ఎంపీడీఓ ఆంజనేయులు పర్యవేక్షణలో ఈ ఎన్నిక నిర్వహించారు. అల్లాజీ పేరును ఎంపీపీ గాడి కాసు ప్రతిపాదించగా వైస్ ఎంపీపీలు బైన కుమారి ఈశ్వరరావు, శరగడం లక్ష్మి నాగేశ్వరరావుతో పాటు 16 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులు మద్దతు ఇవ్వడంతో ఏకగ్రీవంగా ఆయన ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఆయన ఎన్నికపై పార్టీశ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, లక్ష్మీపురం, గాంధీగ్రామం సర్పంచ్‌లు శిరుబోళ్ల గణపతినాయుడు, గాడి అప్పారావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు సత్య, గూనూరు రాజు, ఎంపీటీసీ సభ్యులంతా అభినందనలు తెలిపారు.

అల్లాజీని అభినందించిన బొత్స, ధర్మశ్రీ

కో ఆప్షన్ సభ్యుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైన అల్లాజీని మాజీ మంత్రి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ ప్రభుత్వ విప్, అనకాపల్లి పార్లమెంటు సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అభినందించారు.కష్టపడి పార్టీకి అంకిత భావంతో పనిచేసిన కార్యకర్తలందరికీ సముచిత స్థానం ఉంటుందని బొత్స సత్యనారాయణ అన్నారు.

ఎం.పేదపేట గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం



పూర్తయిన ట్యాంకు నుంచి తాగునీరు సరఫరా ప్రారంభించిన స్థానిక నాయకులు

రోలుగుంట: ఎం.కె.పట్నం పంచాయతీ శివారు ఎం.పెదపేట గ్రామంలో తాగునీటి సమస్య ఉంది. దీనిపై గ్రామస్తులు పలు దఫాలు పంచాయతీ కార్యాలయంలోను, సంబంధిత ఆర్.డబ్ల్యూ.ఎస్ కార్యాలయంలోను వినతిపత్రాలు అందించారు. దీనిపై స్పందించిన పంచాయతీ పాలకవర్గం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో సుమారు రూ.5 లక్షల వ్యయంతో సుమారు వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంకు, పైపులైను పనులు, అవసరమైన గృహాల సముదాయ కూడలిలో కుళాయిల ఏర్పాటు పనులు ఇటీవల పూర్తి చేశారు. సోమవారం ట్యాంకు వద్ద కొబ్బరికాయ కొట్టి తాగునీరు సరఫరాను గ్రామ నాయకులు సతీష్, మద్దు పైడితల్లినాయుడు ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పుచ్చలపల్లి ఆశయాలు ఆదర్శం కావాలి



బంగారుమెట్టలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కూలీలు



పెదబొడ్డేపల్లిలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం



సూర్రెడ్డిపాలెంలో పుచ్చలపల్లి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు



కోడాపల్లిలో పుచ్చలపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేత వెంకన్న, గిరిజనులు

బుచ్చెయ్యపేట : కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సీఐటీయు మండల కార్యదర్శి పినపాత్రుని సాంబశివరావు కోరారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని బంగారుమెట్ట చెరువులో ఉపాధి కూలీల సమక్షంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ధనిక వర్గంలో పుట్టి ఎంపీగా గెలిచి కూడా పుచ్చలపల్లి సుందరయ్య సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లి నిరాడంబర జీవితాన్ని గడిపారన్నారు. పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం,దేశంలో కమ్యూనిస్టు పార్టీ కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. నేటి రాజకీయాలు కులం,మతం,కుటుంబం,మన ప్రాంతం అని కలుషితం అయ్యాయన్నారు. మరలా పుచ్చలపల్లి సుందరయ్యలాంటి ఉన్నతమైన రాజకీయాలు చేసే నాయకులు మనకు రావాలన్నారు.

నర్సీపట్నం : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం నాయకులు పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో సోమవారం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు కె.త్రిమూర్తులరెడ్డి, సాపిరెడ్డి నారాయణమూర్తి, లగుడు గౌరి, సూర్యప్రభ సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య తన యావదాస్తిని పేదల కోసం, పార్టీ కోసం ఖర్చు చేశారన్నారు. సీపీఎం పార్టీ ప్రథమ కార్యదర్శిగా పనిచేయడం ఆంధ్రులకు గర్వకారణమన్నారు. జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, ఈశ్వరరావు, రామకృష్ణ, కృష్ణ, రాము పాల్గొన్నారు

కుల వివక్ష పోరాటంలో పుచ్చలపల్లిది కీలకపాత్ర

కె.కోటపాడు : కుల వివక్ష పోరాటంలో కీలకపాత్రను పోషించిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం నాయకుడు యర్రా దేముడు, రొంగలి ముత్యాలనాయుడు, గండి నాయినిబాబు అన్నారు. మండలంలో సూర్రెడ్డిపాలెం, కె.సంతపాలెం గ్రామాల్లో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుచ్చలపల్లిని ఆదర్శంగా తీసుకోని శ్రామిక, కార్మిక, కర్షకులకు అండగా నిలిచేందుకు సీపీఎం పోరాటం చేస్తుందన్నారు.

దేవరాపల్లి : పుచ్చలపల్లి సుందరయ్య గొప్ప ఆదర్శమూర్తి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. కోడాపల్లి, రామన్నపాలెం గ్రామాలలో స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు నేత సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం నాయకుడు సిహెచ్ లక్ష్మణ్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తామర్ల శంకరరావు, చెదల ఎరకన్నదొర, మామిడి దేముడు, సిహెచ్.దేముడు, బీమాలమ్మ, చినదేముడు, పెంటయ్య, పి.దేముడు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

నాతవరం : సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. మండలంలో సోమవారం జిల్లేడుపూడి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 78 మంది రోగులను పరీక్షించి మరి కొంత మందికి రక్త పరీక్షలు చేశారు. సీజనల్ జ్వరాలు వ్యాపించినప్పుడు తగు జాగ్రత్తలు విధిగా తీసుకోవాలన్నారు.

కుట్టుమిషన్ల శిక్షణ కేంద్రం ప్రారంభం

మాడుగుల రూరల్ : స్థానక సచివాలయం -3 కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, నందారపు సన్యాసిరావు, రమేష్ పాల్గొన్నారు.

మోదమాంబ ఆలయ వార్షికోత్సవం

రావికమతం : టి.అర్జాపురం శివారు కె.గదబపాలెం మోదమాంబ ఆలయ వార్షికోత్సవం పండగ ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ధర్మకర్త, సర్పంచ్ మడుగల ఫాల్గుణ ఆధ్వర్యంలోని ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేశారు. సర్పంచ్‌తో పాటు యువకులు 100 మంది అమ్మవారి మాలధారణ వేసి దీక్షలు చేస్తున్నారు. పండగ రోజు మంగళవారం టి.అర్జాపురం నుంచి 4 కిమీల మేర 108 ఘటాలతో మహిళలు ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి ఘటాలు, నేవైద్యాన్ని సమర్పిస్తారు. జిల్లా స్థాయి ఎడ్ల బండి పోటీలు ఏర్పాటు చేసినట్టు ఆలయ ధర్మకర్త, సర్పంచ్ మడగల ఫాల్గుణ తెలిపారు.

'ఫీజుతో పని లేదు.. పరీక్ష రాయవచ్చు'

నర్సీపట్నం : పదో తరగతి పరీక్ష తప్పిన విద్యార్థులంతా సప్లమెంటరీ పరీక్ష రాసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.తలుపులు తెలిపారు. పరీక్ష ఫీజు కట్టలేని విద్యార్థుల హాల్ టిక్కెట్లను కూడా ఆన్‌లైన్‌లో జనరేట్ చేశారన్నారు. పరీక్ష ఫీజు కట్టినా కట్టకపోయిన హాల్ టిక్కెట్ తీసుకుని పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఆయా పాఠశాలలకు వెళ్లి హాల్ టిక్కెట్లు తీసుకుని పరీక్షకు సిద్ధం కావాలని విద్యార్థులకు ఎంఈవో సూచించారు.